క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


రాజిరెడ్డి (ఫైల్)

టేకుమట్ల: మొగుళ్లపల్లి మండలంలోని పర్లపెల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి (65) ఈ నెల 7న మండలంలోని వెల్లంపల్లిలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తూ రాఘవరెడ్డిపేటలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



కాటారం: ప్రయాణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు ఆధునిక టెక్నాలజీతో ఛేదించి తిరిగి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళకు అందజేశారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోషం ప్రమీల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఈ విషయమై సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఆధునిక టెక్నాలజీ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి సదరు మహిళకు అందజేశారు. సెల్‌ఫోన్‌ను తిరిగి అందించడం పట్ల ప్రమీల ఎస్సై అభినవ్, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఏజెన్సీ దళిత సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏటూరునాగారం అత్మ చైర్మన్ దుర్గం రమణయ్య తండ్రి రామయ్య(80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మోహన్‌రావు, మంగపేట మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు, వివిధ పార్టీ నాయకులు పరామర్శించారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



కన్నాయిగూడెం: మండలపరిధిలోని తుపాకులగూడెం, దేవాదుల, గుర్రేవుల, చింతగూడెం, కంతనపల్లి గ్రామాల్లో బుధవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 250 నిరుపేద విద్యార్థులకు డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ గణేష్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు కంతి ముత్తయ్య, ముర్రం రాజేష్, కంతి లక్ష్మణరావు, పోరెబెట్టి ఆదిశివ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు


దాడుల్లో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

మహదేవపూర్ : మండల కేంద్రంతో పాటు కుదురుపల్లి, బొమ్మపూర్, సూరారం గ్రామాల్లో బుధవారం బెల్టుషాపుల పై దాడులు నిర్వహించారు. మద్యం బయటి నుంచి తీసుకువచ్చి అమ్ముతున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ ఎస్పీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సీఐ ప్రశాంతి, ఎస్సై పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందాలి

కొత్తగూడ: ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలని వేలుబెల్లి సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి అన్నారు. గ్రామంలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ భద్రయ్య, నాయకులు యాప సీతయ్య, నవీన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండలంలోని రేపాకలో కింగ్స్–11 యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మరోసారి ప్రయత్నించి గెలుపొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పానగంటి తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూటోజు కిష్టయ్య, పున్నం రవి, పట్టెం శంకర్, ములకనూరి భిక్షపతి, బొజ్జం రవి, సాంబయ్య, సదయ్య, రాంబాబు, రమేష్, జాని, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు


వాజేడు : మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వాజేడు: మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మైనారిటీ తీరని పిల్లలను పనిలో పెట్టుకోవద్దన్నారు. రైతులు ఛత్తీస్ గఢ్ నుంచి కూలీలను తీసుకొస్తున్నారని వారిలో చిన్న పిల్లల్లు లేకుండా చూసుకోవాలన్నారు. మైనారిటీ తీరని పిల్లలను పనిలో పెట్టుకుంటే రైతుతో పాటు పిల్లల తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


కాటారం : మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

కాటారం: విద్యార్థులు చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని స్థానిక ఎస్సై అభినవ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాలు, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చదువుపై దృష్టి సారించి గొప్పస్థానంలో నిలవాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించడం చట్టరీత్యా నేరమని ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు చేరవేయాలని ఎస్సై కోరారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మెడికల్ షాపులు, పాన్‌షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గంజాయికి సంబంధించిన పదార్థాలను విక్రయించవద్దని సూచించారు. కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అశోక్

ములుగు: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహపూర్వక వాతావరణలో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గొల్లపల్లి రాజేందర్, చింత నిప్పుల భిక్షపతి, చాంద్‌పాషా, నల్లెల భరత్, రవి చందర్, ఎల్లావుల అశోక్, ప్రవీణ్, వంగ రవి, ఓంప్రకాష్,రమేష్, రఘు, సతీష్, శ్రీను, మాజీ ఎంపీటీసీ ఇమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్‌శాఖ దాడులు


బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది


వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం సమీపంలోని అటవీప్రాంతంలో గుడుంబా స్థావరాలపై పోలీస్‌శాఖ దాడులు నిర్వహించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. వీరభద్రవరం గ్రామ సమీపంలో భారీఎత్తున గుడుంబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 2000 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా గుడుంబా విక్రయించిన, తయారు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.దాడుల్లో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

వాజేడు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో బుధవారం మూడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. నాగారం సర్పంచ్ తల్లాడి ఆదినారాయణ రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వెంకటాపురం(కె), వాజేడు, ఏటూర్‌నాగారం మండలాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులైన నాగారం యూత్ కమిటీ వారు తెలిపారు. గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నారు.కార్యక్రమంలో దాట్ల వాసు, కాకర్లపూడి విక్రాంత్, బోదెబోయిన కృష్ణ, సుధాకర్, సత్యనారాయణ, సీతారామయ్య, రాంబాబు, సాంబశివరావు, నాగేశ్వరావు, నాన బాబు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సాంబయ్య

నడికూడ : యువకులు, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అన్నారు. మండలంలోని వరికోల్ గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా ఉండాలని అన్నారు. అలాగే చర్లపల్లి గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, ఆర్గనైజర్ బొల్లారం అనిల్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులతో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తగులబెట్టిన కేసులో ఒకరి అరెస్ట్

రేగొండ: వాహనాలు తగులబెట్టిన కేసులో ఒకరిని అరెస్ట్ చేశామని, ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సీఐ వేణుచందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన బైకని రాజేందర్‌కు చెందిన టాటా మేజిక్, టూ వీలర్ వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ విషయంపై రాజేందర్ తండ్రి మల్లయ్య పోలీస్‌స్టేషన్‌లో అనుమానితుడైన లింగంపల్లి శ్రీధర్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొడవటంచ బస్టాండ్ వద్ద నిందితుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన బొమ్మ ప్రమీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను గౌడ సంఘం నాయకులు బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆమె కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించి, ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు పెరుమాండ్ల రంజిత్‌గౌడ్, గునిగంటి మహేందర్, మేడిపెల్లి సంపత్, గట్టు తిరుపతి, పెనరు రాజేష్, మల్లికార్జున్, ప్రభాకర్, శివ, సారయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఏఐటీయూసీ అండ

భూపాలపల్లి అర్బన్: బొగ్గు గని ప్రమాదంలో మృతి చెందిన మచ్చ రమేశ్ మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి ఏఐటీయూసీ అండగా ఉందని యూనియన్ గని పిట్ కమిటీ కార్యదర్శి దోర్నాల తిరుపతి అన్నారు. కాసీపేట బొగ్గు గనిలో ప్రమాదానికి గురైన రమేశ్ ఏరియాలోని కేటీకే 5వ గనిలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. పరామర్శించిన వారిలో నాయకులు నారాయణమూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, అంజనేయులు, తిరుపతిరెడ్డి, ప్రకాష్, రమేష్‌లు ఉన్నారు.

రేపు మండల సమావేశం

వెంకటాపురం(కె) : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అడ్డూరి బాబు బుధవారం తెలిపారు. ఎంపీపీ చెరుకూరి సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని మండల శాఖ అధికారులు తమ పూర్తిస్థాయి నివేదికలతో రావాలని సూచించారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


వెల్లంపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సురేందర్‌రెడ్డి


టేకుమట్లలో..

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కూర సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంపల్లిలో రెడ్డిబిడ్డ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఉపసర్పంచ్ కూర వెంకటరాజిరెడ్డితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ఎంతో మంది నిరుపేద రెడ్డిలు ఉన్నారని అన్ని రంగాల్లో రిజర్వేషన్లతో వెనుకబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొర్కికాల కృష్ణారెడ్డి, గోపు జనార్దన్‌రెడ్డి, మేకల వీరారెడ్డి, గట్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మండల కేంద్రంలో ఆర్టీఐ నూతన క్యాలెండర్‌ను జిల్లా, మండల అధ్యక్షులు చర్లపల్లి వెంకటేశ్వర్లు, మార్క శరత్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై గట్ల సుధాకర్, తహసీల్దార్ మంజుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రావు, రాజిరెడ్డి, రవీందర్, మోహన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ


టేకుమట్ల : దరఖాస్తులను ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

టేకుమట్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన ప్రజాపాలన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 6 నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మొదలు పెట్టారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల నుంచి తీసుకున్న దరఖాస్తులు 9340, కాగా బుధవారం వరకు 7388 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీఓ గౌడ సురేష్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంతో పాటు, సీఎస్‌సీ, మీసేవా కేంద్రాలు, ఇంటర్‌నెట్ సెంటర్ల ద్వారా పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పొందుపర్చనున్నట్లు తెలిపారు.

మంగపేట ప్రజాపాలన కార్యక్రమంలో

మంగపేట: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 14,354 దరఖాస్తులు, రేషన్ కార్డులు, వివిధ రకాల సమస్యలపై 3027 జనరల్ దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీఓ మమత తెలిపారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఈనెల 6 నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాలతో పాటు కమలాపురం పంచాయతీ కార్యాలయం సెంటర్లలో ప్రారంభించారు. బుధవారం నాటికి 80 శాతం చేశామని గురువారం నాటికి 100 శాతం పూర్తి కానున్నట్లు ఎంపీఓ తెలిపారు.ఎలాంటి తప్పులు లేకుండా త్వరిత గతిన పూర్తి చేసేందుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆలేటి సుదర్శన్, తహసీల్దార్ వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతిలో వజ్రాయుధం లాంటిందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక 2024 క్యాలెండర్‌ను రక్షణ వేదిక సభ్యులతో కలిసి ఆయన బుధవారం ఆవిష్కరించారు. అవినీతిరహిత సమాజం కోసం సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని దాని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అవినీతి అక్రమాలను ఎదుర్కొనేందుకు యువత, రైతులు, ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకొని పేద ప్రజలకు న్యాయం చేసే విధంగా రక్షణ వేదిక సభ్యులు తోడ్పడాలని సూచించారు. పాలనలో పారదర్శకత, అధికారులు జవాబుదారితనంగా ఉండాలని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక మల్హర్ మండల అధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చొప్పరి రాజయ్య, ప్రధాన కార్యదర్శి శనిగల లక్ష్మణ్, కార్యదర్శి బండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- జీసీడీఓ రమాదేవి


స్టోర్‌రూమ్‌లో సామగ్రిని తనిఖీ చేస్తున్న జీసీడీఓ

ఏటూరునాగారం: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జీసీడీఓ రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక క్లాస్‌లు తీసుకొని వారిని చదువులో రాణించేలా చూడాలన్నారు. అంతేకాకుండా ఏజెన్సీ వారు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించి అనుమతించాలన్నారు. పాడైపోయిన ఆహారం వెంటే బయట పడవేయాలన్నారు. కూరగాయలు, పాలు, ఇతర వస్తువుల తనిఖీలు చేయాలన్నారు. పదిలో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలన్నారు.

శ్రీరామ అక్షింతలతో శోభాయాత్ర


చిట్యాల : జడలపేటలో అక్షింతలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు


వాజేడు : అక్షింతలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చిట్యాల: మండలంలోని జడలపేటలో వైభవంగా అయోధ్య శ్రీరాముని అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర గ్రామ సంచాలన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ పంపిణీ చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చిట్యాల ఖండ్ ప్రచారక్ ఎలికట్టె మహేందర్‌జీ, ఖండ్ కార్యవాహ బుర్ర తిరుపతిజీ, గ్రామ సంచాలన సమితి సభ్యులు గురిజాల రామకృష్ణ , వేదాచారి, కామిడి నారాయణరెడ్డి, అశోకాచారి, సుధగాని శ్రీనివాస్, బొమ్మనపల్లి కోటి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రామయ్య అక్షింతల పంపిణీ

వాజేడు: అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలను బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలతో మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారి అక్షింతలను ప్రతీ ఇంటికి ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం


ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేస్తూ తమ హావభావాలను వ్యక్తపర్చారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని చాటిచెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ విలాస్‌రావు, ఉపాధ్యాయులు పవన్, ప్రణీత్, అఖిల్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.